క్లుప్తంగా

క్రీడా సామగ్రి పంపిణీ

పాలకొండ: ఓని గ్రామంలోని ప్రభుత్వం పాఠశాలలో విద్యార్థులకు శనివారం ఆట వస్తువులు పంపిణీ చేశారు. ప్రభుత్వం విద్యార్థుల కోసం మంజూరు చేసిన చెస్, స్కిప్పింగ్ తాళ్లు, రింగులు, వాలీబాల్, నెట్ తదితర క్రీడా సామగ్రిని విద్యార్థులకు అందజేసినట్లు హెచ్‌ఎం నాగమణి తెలిపారు. విద్యార్థుల్లో శారీరక, మానసిక వికాసానికి క్రీడలు ఎంతో దోహదపడతాయన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు పాలవలస శారదాకుమారి, జి.సూర్యనారాయణ, దానేటి పుష్పలత, సిద్దాబత్తుల వెంకటరమణ, కుదుమ తిరుమలరావు పాల్గొన్నారు.

రేపు సీపీఎం బస్సు యాత్ర

సీతంపేట: ఈనెల 30న సీపీఎం పార్టీ ప్రజారక్షణ బస్సు యాత్ర సీతంపేట నుంచి ప్రారంభమౌతుందని ఆ పార్టీ కార్యదర్శివర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీపీఎం పార్టీ రాష్ట్ర పోలిట్ బ్యూరో సభ్యులు బి.వి రాఘవులు ఈ యాత్రను ప్రారంభిస్తారన్నారు. మేధావులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని యాత్రను విజయవంతం చేయాలని కోరారు.

ఐటీడీఏలో వాల్మీకి జయంతి



వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేస్తున్న అధికారులు

సీతంపేట: స్థానిక ఐటీడీఏలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో శనివారం వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఏపీఓ రోసిరెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డీడీ మంగవేణి, ఏఎంఓ కోటిబాబు, జీసీడీఓ రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణ పనుల పరిశీలన



ఆలయ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కిశోర్‌చంద్రదేవ్

కురుపాం: మండల కేంద్రంలోని శివ్వన్నపేట జగన్నాథస్వామి ఆలయం సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయాన్ని మాజీ కేంద్రం మంత్రి వైరిచర్ల కిశోరచంద్రదేవ్ శనివారం పరిశీలించారు. ఆలయ కమిటీ సభ్యులతో, గ్రామ పెద్దలతో మాట్లాడి నిర్మాణ పనులు ఎంతవరకు వచ్చాయి, ఖర్చు, తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల రిలే దీక్షలు



దీక్షలు చేస్తున్న ఎన్‌ఎంయూ యూనియన్ నాయకులు

పాలకొండ: స్థానిక ఆర్టీసీ డిపో వద్ద ఎన్‌ఎంయూ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం కొనసాగాయి. జోనల్ కమిటీ పిలుపు మేరకు ఈ దీక్షలు చేపట్టినట్లు ఎన్‌ఎంయూ రీజనల్ ఉపాధ్యక్షుడు పీఎల్‌రావు తెలిపారు. దీక్షల్లో వి.రాజేష్, ఎ.కృష్ణంనాయుడు, పి.పుణ్యవతి, పి.మణి, టి.ధర్మంభ, బీవీ భాను, తదితరులు పాల్గొన్నారు.

గొట్టివలస వద్ద గజరాజులు

గరుగుబిల్లి: మండలంలోని గొట్టివలస వద్ద ఏడు ఏనుగుల గుంపు ఉందని జిల్లా అటవీ శాఖాధికారి జీపీపీ ప్రసూన తెలిపారు. శనివారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. గత పది రోజులుగా గొట్టివలస వద్ద ఏడు ఏనుగుల గుంపు ఉందని, కొద్ది రోజుల్లో ఇతర ప్రాంతాలకు వెళ్లే అవకాశం ఉందన్నారు. గొట్టివలస, దాలివలస, ఉద్దవోలు, శివ్వాం, కొత్తూరు, కోటరామినాయుడువలస, ఉల్లిభద్ర గ్రామ ప్రజలు అప్రమత్తంగాఉండాలని ఆమె తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

వీరఘట్టం: నడుకూరు అంగన్‌వాడీ–2 కేంద్రంలో ఖాళీగా ఉన్న కార్యకర్త పోస్టుకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ సిమ్మాలమ్మ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నడుకూరు గ్రామానికి చెందిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హత, ఆసక్తి ఉన్నవారు నవంబర్ 1 తేదీ సాయంత్రం 5 గంటల లోపు పాలకొండ ఐసీడీఎస్ కార్యాలయంలో నేరుగా దరఖాస్తులు అందజేయాలని పేర్కొన్నారు.

నిరుపేదలకు దుస్తుల పంపిణీ

వీరఘట్టం: మండలంలోని తెట్టంగి గ్రామానికి వైఎస్సార్‌సీపీ నాయకుడు, పాలకొండ ఏఎంసీ వైస్ చైర్మన్ పొట్నూరు లక్ష్మణరావు శనివారం 150 మంది వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. తన కుమారుడు ముఖేష్ జ్ఞాపకార్థం దుస్తులు పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ అలజంగి విజయ, ఎంపీటీసీ సతివాడ వరలక్ష్మీ, చిన్నంనాయుడు, పొట్నూరు పరిశినాయుడు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి

వీరఘట్టం: విద్యార్థులు చదువుతో పాటు క్రీడాల్లో రాణించాలని ఎంఈఓ ఆర్.ఆనందరావు సూచించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ గ్రౌండ్‌లో విద్యార్థులకు క్రీడా పరికరాలను శనివారం అందజేశారు. క్రీడల్లో రాణించడం ద్వారా ఉద్యోగావకాశాలు పెరుగుతాయన్నారు.

ప్రజారోగ్య భద్రతకు ప్రాధాన్యం



జియ్యమ్మవలస: చింతలబెలగాంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న ఆర్డీఓ లావణ్య



గుమ్మలక్ష్మీపురంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ గౌరీశంకరరావు, వైస్ ఎంపీపీ నిమ్మక శేఖర్, తదితరులు



కురుపాం: బియ్యాలవలసలో జరిగిన ఆరోగ్య సురక్ష శిబిరంలో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ శెట్టి పద్మావతి



సీతంపేట: పూతికవలసలో ఆరోగ్య సురక్ష శిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్య భద్రతకు అధిక ప్రాధాన్యతనిస్తోంది. ఇప్పటికే ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్యం అందిస్తుండగా.. ప్రస్తుతం గ్రామస్థాయిలోనే ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలనే ఉద్దేశంతో 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. పాలకొండ, కురుపాం నియోజకవర్గాల్లోని పలు సచివాలయాల పరిధిలో శనివారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష శిబిరాలకు పెద్ద సంఖ్యలో ప్రజలు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు వైద్యశిబిరాలను సందర్శించి అక్కడ అందిస్తున్న సేవలను పర్యవేక్షించారు.

– సాక్షి పాలకొండ, కురుపాం

జగనన్నే మళ్లీ సీఎం కావాలి

- ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ వెళ్లి వివరించాలి
- పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి దిశానిర్దేశం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

గుమ్మలక్ష్మీపురం: కుల, మత, ప్రాంతాలకతీతంగా సంక్షేమ ఫలాలను లబ్ధిదారుల ఇంటి ముంగిటకే అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి మళ్లీ సీఎంగా కావాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లతో స్థానిక బీఆర్ఎస్ఆర్ కళింగవైశ్య కళ్యాణ మండపంలో శనివారం సమావేశం నిర్వహించారు. నవంబర్ 9 నుంచి ప్రారంభించనున్న 'వై ఏపీ నీడ్ జగన్' కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వాల హయాంలో ఏ సంక్షేమ పథకం కావాలన్నా.. ధ్రువపత్రాలు కావాలన్నా.. అధికారులకు సమస్యలు విన్నవించుకోవాలన్నా.. పనులు మానుకొని రోజుల తరబడి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. కానీ జగనన్న సీఎం అయ్యాక గ్రామస్థాయిలోనే అన్ని ప్రభుత్వ సేవలు అందించేలా గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారని, గ్రామ వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు చేరవేస్తున్నారని గుర్తుచేశారు. విద్య, వైద్యానికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందన్నారు. అన్ని ఆస్పత్రుల్లో పూర్తిస్థాయిలో వైద్యులు, సిబ్బంది నియామకాలు చేపట్టడంతో పాటు 24 గంటలు వైద్య సేవలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. అలాగే గ్రామస్థాయిలోనే మెరుగైన వైద్య సేవలందేలా ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. రూ.9 కోట్లతో భద్రగిరి పీహెచ్‌సీ నూతన భవనాల నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. 'నాడు–నేడు' కార్యక్రమం ద్వారా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆస్పత్రులను అభివృద్ధి చేయడంతో పాటు అన్ని వసతులు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. నియోజకవర్గంలోని గిరిజన గ్రామాలను అనుసంధానం చేస్తూ రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. అలాగే గిరిజనులకు పోడుపట్టాలు, టీకేటీ పట్టాలను అందజేసినట్లు తెలిపారు. రూ.150 కోట్లతో కురుపాంలో గిరిజన ఇంజినీరింగ్ కళాశాలను నిర్మిస్తున్నామన్నారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. రాష్ట్రానికి మళ్లీ జగనే సీఎంగా ఎందుకు కావాలో ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అంటేనే ప్రజా సంక్షేమం అనేలా ఉందని, రానున్న ఎన్నికల్లో మరోసారి అత్యధిక మెజార్టీతో ఈ ప్రభుత్వాన్నే గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ కుంబురుక దీనమయ్య, జెడ్పీటీసీ మండంగి రాధిక, వైస్ ఎంపీపీలు నిమ్మక శేఖర్, లక్ష్మణరావు, రజక కార్పొరేషన్ డైరెక్టర్ గోరిశెట్టి గిరిబాబు, సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు బి.గౌరీశంకరరావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేడు కొమరాడలో సమావేశం

కొమరాడ: కొమరాడలో వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం ఆదివారం నిర్వహించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్దనరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సమావేశానికి మండలంలోని వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, బూత్ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు హాజరు కావాలని కోరారు.

జలాశయంలో చేపపిల్లల విడుదల



వట్టిగెడ్డ జలాశయంలో చేపపిల్లలను విడిచిపెడుతున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస: మండలంలోని రావాడ వట్టిగెడ్డ జలాశయం, పరజపాడు చెరువులో మత్స్యశాఖ అధికారులు ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి చేతులమీదుగా శనివారం చేపపిల్లలను విడిచిపెట్టారు. మత్స్యకార సహకార సంఘాల జీవన భృతికి ఇది ఎంతగానో ఉపయుక్తంగా ఉంటుందని ఎమ్మెల్యే అన్నారు. వట్టిగెడ్డ జలాశమంలో 88,200, పరజపాడు జగన్నాథ సాగరంలో 58,800 చేపపిల్లలను విడిచిపెట్టినట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి వి.తిరుపతయ్య తెలిపారు. కార్యక్రమంలో మండల మత్స్యశాఖ అధికారి డి.గోపీకృష్ణ, మత్స్య సంఘాల డైరెక్టర్ మురళి, ప్రెసిడెంట్ డి.లక్ష్మణరావు, వట్టిగెడ్డ మాజీ చైర్మన్ బలగ వెంకటరమణ, మండల కన్వీనర్ మూడడ్ల గౌరీశంకరరావు, జెడ్పీటీసీ శశికళ, నాయకులు మరడాన కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణాలు వేగవంతం చేయాలి

- ఆర్డీఓ ఎం.లావణ్య



అధికారులకు సూచనలు చేస్తున్న ఆర్డీఓ ఎం.లావణ్య

కురుపాం: జగనన్న లేఅవుట్లలో లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలు చురుగ్గా జరిగేలా చూడాలని ఆర్డీఓ ఎం.లావణ్య అధికారులకు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కురుపాం నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన హౌసింగ్, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. నాలుగు మండలాల్లో జగనన్న లేఅవుట్లలో నిర్మాణ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాల పురోగతిపై, ఆర్‌బీకేలు, సచివాలయ భవనాల నిర్మాణంపై ఆరాతీశారు. సకాలంలో నిర్మాణాలు పూర్తిచేసేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ రమేష్‌కుమార్, హౌసింగ్ డీఈ పి.మోహనరావు, ఏఈలు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పాలనను వివరిస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్, తదితరులు

- ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

పాలకొండ రూరల్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా జగనన్న ప్రభుత్వం అడుగులు ముందుకు వేస్తోందని శాసనసభ ఆర్థిక వ్యవహారాల అంచనాల కమిటీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, శాసన మండలి ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మండలంలోని తుమరాడ గ్రామంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు వారాడ నాగేంద్రనాయుడు నేతృత్వంలో శనివారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ గ్రామంలోని ఇంటింటికి వెళ్లి ప్రజల యోగక్షేమాలు, సంక్షేమ పథకాల అమలుతీరు, స్థానిక సమస్యలపై ఆరాతీశారు. నాలుగున్నరేళ్లుగా జగనన్న ప్రభుత్వం అందించిన సంక్షేమ లబ్ధిని వివరించారు. పాదయాత్రలో ప్రజల కష్టాలను నేరుగా తెలుసుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన కొద్దిరోజుల్లో ఇచ్చిన హామీలను అమలు చేశారన్నారు. గ్రామస్థాయిలోనే ప్రజలకు అన్ని రకాల ప్రభుత్వ సేవలు అందిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదే అని అన్నారు. అర్హత ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలు ఎవరికైనా అందనట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలని కోరారు. స్థానిక సమస్యలను సానుకూలంగా విని వాటి పరిష్కారానికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు కనపాక సూర్యప్రకాష్, వాకముడి అనిల్‌కుమార్, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లోలుగు విశ్వేశ్వరరావు, పాలవలస దవళేశ్వరరావు, కనుముల సూర్యనారాయణ, బొత్స రమణ, ఎం.గోవిందరావు, వి.బుల్లిబాబు, పి.వీరయ్య, సీహెచ్.వెంకటరమణ, డిప్యూటీ తహసీల్దార్ బి.బుచ్చయ్య, ఎంపీడీఓ జె.ఉమామహేశ్వరి, సీహెచ్.జగదీష్‌కుమార్, పలు శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు. అంతకుముందు గ్రామ సమీపంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కేవీకేను సందర్శించిన ఎమ్మెల్యే



కేవీకేలో సాగుచేస్తున్న పూలు, కూరగాయల పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి, పరీక్షిత్‌రాజు

కురుపాం: నియోజకవర్గంలో గిరిజన రైతులకు అధిక దిగుబడులు సాధించేలా కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు మరింత ప్రోత్సహించాలని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, పార్వతీపురం మన్యం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు అన్నారు. మండలంలోని రస్తాకుంటుబాయి కృషివిజ్ఞాన కేంద్రాన్ని శనివారం వారు సందర్శించారు. కేవీకే ద్వారా గిరిజన రైతులకు అందుతున్న సేవలపై, నూతన పరిశోధనలపై కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ టి.ఎస్.ఎస్.కె.పాత్రోను అడిగి తెలుసుకున్నారు. కేవీకేలో జరుగుతున్న అభివృద్ధి పనులు, డెమో యూనిట్లు, పూలు, కూరగాయల సాగును పరిశీలించారు.

రేషన్ డీలర్ అక్రమాలపై విచారణ

భామిని: తివ్వాకొండల్లోని ఆదివాసీ గిరిజనులకు ప్రభుత్వం అందిస్తున్న రేషన్ సరుకులను స్వాహా చేస్తున్న రేషన్ డీలర్ అక్రమాలపై అధికారులు శనివారం విచారణ చేపట్టారు. రేషన్ డీలర్ అక్రమాలపై మణిగ సర్పంచ్ కొండగొర్రి మంగ, వైఎస్సార్‌సీపీ నాయకుడు కొండగొర్రి చంటి ఆధ్వర్యంలో గ్రామస్తులు పాలకొండ సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో ఆయన ఆదేశాల మేరకు తహసీల్దార్ నీలాపు అప్పారావు, సీఎస్‌డీటీ మధుసూదన్, వీఆర్వో బిడ్డిక గోపాల్ విచారణ చేపట్టారు. మణిగ, రాతులగూడ, చీమలగూడ, ఏటంగూడలో రేషన్ లబ్ధిదారుల నుంచి వివరాలు సేకరించారు. బయోమెట్రిక్ నమోదు చేసి బియ్యం ఇవ్వడం లేదని, అంగన్‌వాడీ కేంద్రాలకు, పాఠశాలలకు ఎండీఎం సరుకులు అందించడం లేదని ఫిర్యాదుదారులు తెలిపారు. ఈ నెల కందిపప్పు, పంచదార కూడా ఇవ్వలేదన్నారు.

కోటదుర్గమ్మ ఆలయం మూసివేత

పాలకొండ రూరల్: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం పాలకొండ కోటదుర్గమ్మ ఆలయాన్ని చంద్ర గ్రహణం సందర్భంగా శనివారం రాత్రి 8గంటలకు అర్చకులు మూసివేశారు. ఆదివారం ఉదయం ఆలయంలో గ్రహణ దోష నివారణ, సంప్రోక్షణ అనంతరం భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించనున్నట్లు అర్చకులు దార్లపూడి లక్ష్మీప్రసాద్ శర్మ తెలిపారు.

ప్రారంభానికి సిద్ధంగా మినీగోదాం

భామిని: సహకార సొసైటీ పరిధిలోని రైతులు పండించిన పంటలను గిట్టుబాటు ధర వచ్చే వరకు నిలువ చేసుకునేందుకు వీలుగా చేపట్టిన మినీ గోదాంల నిర్మాణాలు పూర్తికావచ్చాయి. భామిని సొసైటీ పరిధిలో లివిరి గ్రామంలో సుమారు రూ.40 లక్షల వ్యయంతో మినీగోదాంను నిర్మించారు. ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి చేతులమీదుగా త్వరలోనే ప్రారంభించనున్నట్లు సొసైటీ చైర్మన్ గెల్లంకి రమేష్ తెలిపారు.

3న విద్యాసామర్థ్య పరీక్ష

వీరఘట్టం: స్టేట్ ఎడ్యుకేషనల్ ఎచీవ్‌మెంట్ సర్వీసు ఆధ్వర్యంలో వచ్చే నెల 3న విద్యాసామర్థ్య పరీక్ష నిర్వహించనున్నట్లు ఎంఈఓలు డి.గౌరినాయుడు, ఆర్.ఆనందరావులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 3,6,9 తరగతులు చదువుతున్న విద్యార్థులకు ఈ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

హోంగార్డు సేవాభావం



రోడ్డుపై మతిస్థిమితం లేని వ్యక్తికి బట్టలు తొడుగుతున్న హోంగార్డ్ పూర్ణచంద్ర

భామిని: పాతపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో హోంగార్డ్‌గా పనిచేస్తున్న భామిని మండలం పసుకుడికి చెందిన పూర్ణచంద్ర సాహు తన సేవలతో పలువురి మన్ననలు పొందుతున్నారు. వృద్ధులు, అనాథలకు భోజనాలు పెట్టడం, చలి నుంచి రక్షణకు దుప్పట్లు అందించడం, అనారోగ్యంతో ఉన్నవారిని ఆస్పత్రికి తీసుకువెళ్లి వైద్యం అందించడం వంటి సామాజిక కార్యక్రమాలు చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. హోంగార్డు విధులతో పాటు సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని అందరి మన్ననలు పొందుతున్నాడు.

ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దాలి



ప్రశ్నలు అడిగి, విద్యార్థుల విద్యాసామర్థ్యాలు పరిశీలిస్తున్న ఎంఈవో సింహాచలం

బలిజిపేట: మంచి విద్యాబోధనతో విద్యార్థులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దాలని ఎంఈవో సామల సింహాచలం అన్నారు. మండలంలోని గంగాడ గ్రామ డీపీఈపీ పాఠశాలను శనివారం సందర్శించిన ఆయన పాఠశాల రికార్డులతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. అనంతరం వివిధ ప్రశ్నల ద్వారా విద్యార్థుల విద్యాసామర్థ్యాలను ఆయన గమనించి, విద్యార్థుల విద్యాప్రగతిపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు ఆదర్శంగా నిలవాలని, నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించాలన్నారు. కనీస అభ్యసన సామర్థ్యాలు విద్యార్థులకు వచ్చేలా చూడాలన్నారు. ముఖ్యంగా ఆంగ్లంపై విద్యార్థులు పట్టు సాధించేలా శిక్షణ ఇవ్వాలన్నారు. ప్రతిరోజూ విద్యార్థులతో ఆంగ్ల పాఠాలు చదివించి, ప్రతీ ఆంగ్ల పదానికి అర్థం తెలియజేయాలన్నారు.

31న కోరన్న, మంగన్న వర్ధంతి



ఎల్విన్‌పేటలో ప్రచారం చేస్తున్న సీపీఐ నాయకులు

గుమ్మలక్ష్మీపురం: ఈనెల 31న గుమ్మలక్ష్మీపురంలోని కళ్యాణ మండపం వద్ద నిర్వహించనున్న కామ్రేడ్‌లు కోరన్న, మంగన్నల వర్ధంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తోట జీవన్న, కార్యవర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్య కోరారు. ఈ మేరకు గుమ్మలక్ష్మీపురం, ఎల్విన్‌పేట గ్రామాల్లో పార్టీ నాయకులతో కలిసి శనివారం ప్రచారం చేశారు. హక్కుల సాధన కోసం పోరాడే వారికి కోరన్న, మంగన్నలు స్ఫూర్తిదాయకమన్నారు. గిరిజన రైతుల పక్షాన పోరాడి అమరులైన కోరన్న, మంగన్న త్యాగాలను స్మరించుకోవడం మనందరి బాధ్యత అన్నారు. వారి వర్ధంతి సభలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

గ్రామాల్లో గౌరీపౌర్ణమి సందడి



జియ్యమ్మవలస: వెంకటరాజపురంలో నందెన్నను ఊరేగిస్తున్న భక్తులు



పాలకొండ రూరల్: దేవరపేటలో భక్తుల పూజలందుకుంటున్న నందీశ్వరుడు

గ్రామాల్లో గౌరీపౌర్ణమి ఉత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. భక్తులు గౌరీశంకరులు నందిపై ఆశీనులై ఉన్న ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువచ్చి మండపాల్లో ప్రతిష్ఠించి పూజలు చేశారు. మహిళలు ఉదయం నుంచి ఉపవాసం ఆచరించి గౌరీనోములు నోచారు. ఉత్సవాల సందర్భంగా గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ నెలకొంది.

– సాక్షి పాలకొండ, కురుపాం